

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయరూ?

- గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై 32 గుంతలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- రాత్రివేళల్లో గుంతలు కనబడక ప్రమాదాలు

8

ఆ పిల్లలకు 'భరోసా'

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఫౌండేషన్

మర్కుక్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లల తల్లిదండ్రులు మృతిచెందిన నేపథ్యంలో 'చిన్నారులకు ఎంత కష్టమొచ్చింది' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి భరోసా ఫౌండేషన్ సభ్యులు స్పందించారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.పదివేల విలువ చేసే నిత్యావసర సరుకులు, బియ్యాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు స్వామి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాన్ని తమ స్నేహితులతో చర్చించగా ఆ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకులు అందించామని, భవిష్యత్తులో పిల్లల చదువులకు ఆర్థికంగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరోసా ఫౌండేషన్ సభ్యులు నరేష్, శివ, రాజు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

11, 20న సుడా లేఅవుట్ బహిరంగ వేలం

సిద్దిపేట అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లి పరిధిలో ఏర్పాటుచేసిన సుడా మోడల్ లేఅవుట్ బహిరంగ వేలం పాట ఈ నెల 11, 20 తేదీల్లో నిర్వహించనున్నట్లు సుడా వైస్ చైర్మన్ అశ్వీత్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సుడా లేఅవుట్‌లోని ప్లాట్లకు గతంలో వేలం నిర్వహించామని, మిగిలిపోయిన 98 ప్లాట్లకు మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాట సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుడా కార్యాలయంలో కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తిగలవారు సంబంధిత పత్రాలతో సంప్రదించాలని కోరారు.



తండాలు.. దండాలు

చెరగని సాంస్కృతిక సౌరభం.. గిరిపుత్రుల సంప్రదాయం



విభిన్నమైన ఆహార్యం, అలవాట్లు, సంస్కృతీసంప్రదాయాలు గిరిపుత్రుల సొంతం. అడవి తల్లిని నమ్ముకుని జీవించిన నాటి పరిస్థితుల నుంచి.. నేటి ఆధునిక సమాజంలోనూ తమ సంప్రదాయాలను చెక్కుచెదరనీయకుండా మారిన తరాలకు అందిస్తున్నారు గిరిజనులు. తండాలలో నివసిస్తూ సంస్కృతీ వైభవాన్ని కాపాడుకుంటున్న వారికి దండాలు పెట్టాల్సిందే.

- అక్కన్నపేట (ఆంధ్రజ్యోతి)

విభిన్న వస్త్రధారణ.. కట్టు, బొట్టుతో మహిళలు
గిరిజనుల స్పెషల్ వంటకాల రుచే వేరు
సీత్లా, తీజ్ పండుగలు ప్రత్యేకం

ఉమ్మడి మెదక్ జిల్లాలో చెప్పుకోదగ్గ స్థాయిలో గిరిజన తండాలు ఉన్నాయి. అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఈ తండాలలో నివసిస్తూ తమ సంస్కృతీ వైభవాన్ని చాటుతున్నారు. వందమందిలో ఉన్నా గిరిజనులను గుర్తించేలా చేసేది వారి భిన్నమైన వస్త్రధారణ. వారి సంప్రదాయ దుస్తులు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. రంగురంగుల అద్దాలు పొదిగిన రవిక, దుప్పట్టాలు.. మణికట్టు నుంచి మోచేతిపై వరకు ధరించే మందపాటి తెల్లటి గాజులు, నాణెలు, అద్దాలతో తయారు చేసిన వస్త్రాన్ని తలపై నుంచి ధరించడం, పొడవాటి పెద్ద చెవి దుద్దులు, మెడలో వెండి హారం, గొలుసులు, కాళ్లకు ధరించే కడియాలు, గజ్జెలు వారి విభిన్న వేషధారణను సూచిస్తుంది. వారు నడుస్తున్నప్పుడు చేసే వినసొంపైన శబ్దం.. సంప్రదాయ దుస్తుల్లో తమకే సొంతమైన జానపద పాటలకు వారు చేసే నృత్యం వారి సంస్కృతిని ప్రతిబింబిస్తోంది. సీత్లా, తీజ్ ఉత్సవాల సమయంలో హోదాలను మరిచి అందరూ లంబాడి పదాలతో రచించిన అద్భుతమైన గీతాలకు లయబద్ధంగా నృత్యాలు చేస్తుంటారు.

సీత్లా భవానీ ఉత్సవాలు

గిరిజనుల సంస్కృతికి ప్రతీకైన సీత్లా భవానీ పండగను ప్రతీఏటా ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన పెద్ద పూసాల కార్తెలో మంగళవారం రోజున నిర్వహించుకోవడం తరాల నుంచి

మిగతా ఏడో పేజీలో

సండే స్పెషల్
Sunday Special



తలపడుతున్న బాలికల జట్లు

హోరాహోరీ

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

హుస్నాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు రెండోరోజు హోరాహోరీగా కొనసాగాయి. శనివారం నిర్వహించిన లీగ్ మాచ్‌ల్లో గెలుపొందిన జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఆదివారం నిర్వహించనున్న నాకౌట్ మ్యాచ్‌లలో విజయం సాధించిన జట్లు ఫైనల్ పోరుకు చేరుకుంటాయని రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడా పోటీల అబ్జర్వర్ శ్రీనివాస్ తెలిపారు. పూల్ ఏలో ఐదు జిల్లాలు, పూల్ బీలో ఐదు జిల్లాల జట్లు తలపడుతున్నాయి. బాలికల విభాగంలో మెదక్, ఖమ్మం జట్టుపై గెలుపొంది సెమిఫైనల్‌కు అర్హత సాధించింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఎంఈవో బండారి మనీల, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ఆర్గనైజర్ ఆర్ శ్రీనివాస్, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య, కో ఆర్డినేటర్ బూట్ల రాజమల్లయ్య, నిర్వాహకులు రాగుల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కృష్ణ తదితరులున్నారు.

ఒత్తిడిని జయిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌మూర్తి

- దేశంలోని తొలిసారిగా ఒత్తిడి లేని విద్యపై ప్రత్యేక కార్యక్రమం
- ఒక్కో వర్సిటీలో ఒక్కో విధానం
- దేశ నలుమూలల నుంచి 100కుపైగా విద్యాసంస్థలు హాజరు

7

కల్వకుంట్ల కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదు

- విజన్ ఉన్న నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



సిద్దిపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నా ప్రాణమున్నంత వరకు కల్వకుంట్ల కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదు' అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు వ్యక్తిగతంగా ఎవరితో కక్షలు లేవని తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి, ప్రతి ఒక్కరిమీద రూ.1.50 అప్పు పెట్టారని చెప్పారు. అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్ర రైతులను పట్టించుకోలేదని, కానీ గతంలో పంజాబ్ రైతులు రోడ్డెక్కి ఢిల్లీలో ధర్నా చేస్తే వారిని పరామర్శిస్తానని చెప్పి, మోదీతో రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర భాషను నాశనం చేసింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. సిద్దిపేట ఎవరి అయ్య జాగీరు కాదని, బీఆర్ఎస్ నాయకులు కావాలని రెచ్చగొడుతున్నా, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. సీఎం రేవంత్ జన్మదిన వేడుకల్లో సిద్దిపేట ఏసీపీని తాను పిలిస్తే వచ్చి కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారని, దానిపై బీఆర్ఎస్ నాయకులు తప్పు వెతకడం మానుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారుల కాళ్లు మొక్కించుకున్న ఘనత మీకు దక్కుతుందని చెప్పారు. విజన్ ఉన్న నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని, రానున్న నాలుగేళ్లలో ఊహించని మంచి పనులు జరుగుతాయని చెప్పారు.

సర్వేలో ఏ ఇంటిని వదలవద్దు

- స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను తెలుసుకోవాలి
- సర్వేతో సమర్థవంతంగా పథకాలు రూపొందించే అవకాశం
- కలెక్టర్ మను చౌదరి

కొండపాక/ములుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏ ఇంటిని వదలకుండా సమగ్ర ఇంటింటీ కుటుంబ సర్వేను నిర్వహించాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి ఎన్యూమరేటర్లను ఆదేశించారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో, ములుగు మండల కేంద్రంలో శనివారం ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యూమరేటర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 8వ తేదీ వరకు ఇంటింటికీ స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామని, శనివారం నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కుల వివరాలను ప్రతీ కుటుంబం నుంచి సేకరించి నమోదు చేస్తామన్నారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా వివరాలను పొందుపరచాలని తెలిపారు. దాదాపు 57కుపైగా అంశాలలో వివరాలను నమోదు చేయాలిసి ఉందన్నారు. అన్ని స్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సర్వేతో ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకుని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట సిద్దిపేట ఆర్డీవో సదానందం, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, కొండపాక తహసీల్దార్ దిలీప్‌కుమార్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ములుగు ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.



దుద్దెడలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

కుకునూరుపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక, రాజకీయ, ఆర్థిక, కుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ ఆదేశించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే ఉద్దేశాన్ని ప్రజలకు వివరించి వివరాలను సేకరించాలన్నారు. ప్రజలకు ఏమైనా సర్వేపై సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



యోగాసనం వేస్తున్న వినయ్

జాతీయస్థాయి యోగా పోటీలకు వినయ్

- సబ్ జూనియర్ పోటీలకు సిద్దిపేట విద్యార్థి ఎంపిక

7

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

6

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

- తొగుటలో ఘటన

7

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- రైతు భరోసా ఇచ్చేవరకు రైతు దీక్షలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నాగ్‌సాన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొల్చారం/కౌడిపల్లి/గుమ్మడిదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చి 11 నెలలైనా 6 గ్యారెంటీలు నెరవేర్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో శనివారం రైతుదీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరు హరికృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరి గోలలతో చేసిన హారాన్ని వేసి ఆహ్వానించారు. కౌడిపల్లి మండల పరిధిలోని నాగ్‌సాన్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో ముచ్చటించారు. రైతుదీక్ష శిబిరంలో మాట్లాడారు. 100 రోజుల్లో హామీలు నెరవేర్చుతామని రాష్ట్రంలో ఉన్న గుళ్లలో దేవుళ్లందరిపై ప్రమాణం చేశారని, ఏడాది దగ్గరపడుతున్నా నెరవేర్చలేదని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నిలదీస్తేనే సగం రుణమాఫీ చేశారని, ఇంకా సగం చేయాల్సి ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు భరోసా ఇంకా జమ చేయలేదని, విడుదల చేసేవరకు దీక్ష చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం పర్వదినం సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. 95 మంది దంపతులు వ్రతం చేశారని కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. 9 మంది జంటలు స్వామివారి నిత్యకల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

- వర్గల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

నర్సాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించి, కొనుగోలు తీరును పరిశీలించారు.

యువకుడి వేధింపులు భరించలేక

వివాహిత ఆత్మహత్య


ప్రియాంక మృతదేహం

మర్కుక్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వివాహితను ఓ యువకుడు వేధించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవెల్లిలో శనివారం జరిగింది. మర్కుక్ ఎస్ఐ దామోదర్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రియాంకకు ఎర్రవెల్లికి చెందిన రమేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు అరణ్య(2), భవ్యశ్రీ(5నెలలు) ఉన్నారు. కొంతకాలంగా వివాహితను అదే గ్రామానికి చెందిన కుంట భాస్కర్(32) వేధిస్తున్నాడు. అసభ్యకరంగా మెసేజ్‌లు చేస్తున్నాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పుకోలేని బాధితురాలు శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గతంలోనూ ఇలాగే వేధించగా, పలుమార్లు హెచ్చరించినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నందిని

వెల్దుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వెల్దుర్తి మండల పరిధిలోని మనేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నందిని ఎంపికైంది. శనివారం చేగుంటలో అండర్-14 బాలికల విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ పోటీలు జరిగాయి. ఇందులో నందిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య తెలిపారు.

క్రైం కార్నర్

పనిచోట వేధింపులు.. వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పనిచేసే చోట వేధింపులకు గురిచేయడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండల పరిధిలోని తిమ్మాపూర్ కుషాన్‌గడ్డతండా సమీపంలోని శుభంకరి గోశాలలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం... తండాకు చెందిన మడావత్ లల్యా(44) గ్రామ శివారులోని శుభంకరి గోశాలలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా నెలరోజుల క్రితం లల్యాను పనిలోంచి తీసేశారు. లల్యా కుటుంబసభ్యుల సూచనలతో వారం క్రితం మళ్లీ పనిలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి గోశాల యజమానితో పాటు సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని లల్యా కుటుంబీకులతో వాపోయాడు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి అన్నం తిని గోశాలకు వెళ్లాడు. శనివారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా గోశాల సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


మల్లేశంగౌడ్ (ఫైల్)

తొగుట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఈతచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన తొగుట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన చిలివేరి మల్లేశంగౌడ్(55) కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి గ్రామంలో ఎకరన్నర భూమి ఉండగా.. మల్లన్నసాగర్‌లో ముంపునకు గురైంది. దాంతో తీవ్ర మనోవేదనకు గురైన మల్లేశంగౌడ్ కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురై ఇటీవలే కోలుకున్నాడు. దీంతో కులవృత్తిని చేసుకుంటున్నాడు. శనివారం ఈత చెట్టుకు కల్లు తీసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మోకు ఊడిపోవడంతో చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించిన చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, ముగ్గురు కుమారులు హరీశ్, రాజు, కిశోర్ ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు హరీశ్‌కు వివాహం జరిగింది. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని గ్రామస్థులు కోరారు.

డీసీఎం బోల్తా, ఏడుగురు కూలీలకు గాయాలు

● బొమ్మారం సీడ్ కంపెనీ వద్ద ఘటన

మాసాయిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం బోల్తాపడి ఏడుగురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మాసాయిపేట మండలం బొమ్మారం సీడ్ కంపెనీ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన కూలీలు బొమ్మారంలోని ఓ సీడ్ పరిశ్రమలో పనిచేసేందుకు డీసీఎంలో వెళ్తున్నారు. సమీపంలోని గట్టు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కూలీలు రోషన్, ముకేష్‌కుమార్, మంచ్‌రాం, సంజయ్‌రాం, ఫాజల్, దీపక్, లాల్‌బాగ్ గాయపడ్డారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం పరిశ్రమవారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని స్టాల్

హ్యాండీక్రాఫ్ట్‌లతో మానసికోల్లాసం

ప్రతిరోజూ చూసే చెక్కతో తయారుచేసిన హ్యాండీక్రాఫ్ట్ లతో మా యూనివర్సిటీ విద్యార్థుల్లో మానసికోల్లాసం కలిగిస్తున్నాం. ఈ హ్యాండీక్రాఫ్ట్‌లతో చేసిన గిలకలతో కాళ్లు, చేతులు, పాదాలు, శరీర కండరాలు, తల, వీపుపై మర్దన చేస్తూ ఒత్తిడి పోగొడుతున్నాం.

- కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు


ఐఐటీహెచ్‌లో వెల్‌బీయింగ్ సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి


సన్‌షైన్ కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు

సన్‌షైన్ పేరిట ప్రత్యేక కార్యక్రమం

ఐఐటీహెచ్‌లో సన్‌షైన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాం. ఇందులో భాగంగా ప్రతి క్లాస్ రూమ్‌లో ఒక వాలంటర్ ప్రతీ విద్యార్థిని గమనిస్తారు. విద్యార్థులు సమయానికి క్లాసుకు రాకపోయినా, భోజనం సరిగా చేయకపోయినా వారికి కౌన్సిలింగ్ ఇవ్వడానికి ముగ్గురు సైకలాజికల్ కౌన్సిలర్లను నియమించారు. దీంతో ప్రతి విద్యార్థి ఒత్తిడిని అధిగమించి మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు.

- ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు

ఒత్తిడిని జయిద్దాం

● దేశంలోని తొలిసారిగా ఒత్తిడి లేని విద్యపై ప్రత్యేక కార్యక్రమం
● ఒక్కో వర్సిటీలో ఒక్కో విధానం
● దేశ నలుమూలల నుంచి 100కు పైగా విద్యాసంస్థలు హాజరు

కంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒత్తిడిని తట్టుకుని భవిష్యత్‌కు చక్కటి బాటలు వేసుకునేందుకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ శనివారం వేదికగా మారింది. దేశంలోనే తొలిసారిగా ఐఐటీహెచ్ ప్రాంగణంలో ఒత్తిడి లేని విద్యా, మానసిక ఒత్తిడి నిర్వహణపై జాతీయ సదస్సు నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి కే.సంజయ్ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో దేశ నలుమూలల నుంచి 100కు పైగా విద్యాసంస్థలు పాల్గొన్నాయి. తమ విద్యాసంస్థల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారు చేపడుతున్న వివిధ రకాల పద్ధతులు, అవలంభిస్తున్న విధానాలు ఐఐటీహెచ్ ప్రాంగళంలో స్టాళ్లరూపంలో ప్రదర్శించారు. మానసిక వికాసం పెంపొందించుకుని ఒత్తిడిని తగ్గించుకునేందుకు చక్కటి నిద్ర, సమతూల్య ఆహార పద్ధతులు, మాట్లాడే విధానం, ప్రకృతిని ఆస్వాదిస్తూ నడక, సరైన విశ్రాంతి అవసరమని మానసిక నిపుణులు తెలిపారు. వీటితో పాటే ఆయా విద్యాసంస్థల్లో యోగా, ధ్యానం, నృత్యాలు, పెయింటింగ్, సంగీతం, సామాజిక అంశాలపై చర్చలు, వ్యాయామాలు, ఆటలతో ఒత్తిడిని తగ్గించి మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు.

యోగాసనాలతో ఒత్తిడిని అధిగమిస్తున్నాం


ఒత్తిడి నిర్వహణను వివరిస్తున్న నేషనల్ సంస్క్రిట్ యూనివర్సిటీ, తిరుపతి అధ్యాపకులు

దినచర్యలో భాగంగా మా విద్యాలయాల్లో విద్యార్థులకు ప్రతీరోజు యోగాసనాలు వేయిస్తున్నాం. దీంతోపాటే ధ్యానం చేయడం అలవాటు చేశాం. వివిధ రకాల ఆటల్లో, సంగీతంలో, పురాతన ఇతిహాసల నాటకాలు వేయడంలో నైపుణ్యం పెంపొందిస్తున్నాం. ఫిజికల్ యాక్టివిటీస్ ద్వారానే ఎక్కుగా విద్యార్థులకు ఒత్తిడి తగ్గుతుందని గుర్తించాం. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవడానికి సహకరిస్తున్నాం.

- నేషనల్ సంస్క్రిట్ యూనివర్సిటీ, తిరుపతి అధ్యాపకులు

జీవన విధానంపై శిక్షణ


మానసిక వికాసంపై పద్ధతులను తెలుపుతున్న నాగాలండ్ ఎన్ఐటీ ప్రొఫెసర్లు

మా రాష్ట్రంలో ఎక్కువగా పచ్చని అడవులు ఉంటాయి. దాదాపు 16 తెగలు ఉన్నాయి. మా యూనివర్సిటీలో చదివే విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అటవీ ప్రాంత జీవన విధానంపై శిక్షణ ఇస్తున్నాం. వెదురు బొంగులతో బుట్టలు అల్లించడం, చేతి వస్తువులు, బొమ్మలు తయారు చేయిస్తున్నాం. ఇక్కడ ప్రసిద్ధి చెందిన రాక్‌బ్యాండ్ మ్యూజిక్ నేర్పిస్తున్నాం. మరికొందరికి వయోలిన్, మృదంగం, యోగా, నాగా క్రాఫ్ట్స్ తయారీలో మెళకువలు నేర్పించాం. క్లాస్ కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తున్నాం.

- నాగాలండ్ ఎన్ఐటీ ప్రొఫెసర్లు


జుంబా డ్యాన్స్ గురించి వివరిస్తున్న దృశ్యం

జుంబా డ్యాన్స్ నేర్పిస్తే ఒత్తిడి మాయం

మా యూనివర్సిటీలో ఎవరైన డిప్రెషన్‌గా అనిపిస్తే వారికి జుంబా డ్యాన్స్ నేర్పిస్తాం. జుంబా డ్యాన్స్ చేస్తే ఒత్తిడి కచ్చితంగా దూరం అవుతుందని గుర్తించాం. అంతేగాక హ్యాపీనెస్ సీజన్ పేరిట కార్యక్రమాలు, చర్చలు, యోగా, ధ్యానంతో విద్యార్థుల్లో ఒత్తిడి దూరం చేస్తున్నాం. ఒంటరిగా గడిపే విద్యార్థులకు మానసిక వికాస నిపుణులచే ప్రత్యేక కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నాం.

- ఐఐఎం జమ్మూ-కాశ్మీర్ ప్రొఫెసర్లు


ఖమ్మం జట్టుతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, రాజేందర్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఖమ్మం జట్టు

● ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు

కొండాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్‌లో నాలుగురోజులుగా హోరాహోరీగా జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా జట్టు ఫైనల్ విజేతగా నిలిచింది. చివరి రోజు శనివారం ఎంఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఖమ్మం జిల్లా, ఆదిలాబాద్ జిల్లా జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 50 ఓవర్లలో 336 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు 43.1 ఓవర్లలో 262 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 75 పరుగుల తేడాతో ఖమ్మం జిల్లా జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతి జిల్లాకు సొంత క్రీడా మైదానం కొనుగోలు చేయడం లేదా లీజు గ్రౌండ్ అయినా సమకూర్చడానికి నిధులు వెచ్చిస్తామని తెలిపారు. అనంతరం విజేత ఖమ్మం జట్టుకు ట్రోఫీ, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆగమరావు, వరంగల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రదీప్, సభ్యులు అంజయ్య, శ్రీనాథ్‌రెడ్డి, చంద్రమౌళి, రఘుపతి, విజయ్, అనిల్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

● ఎస్జీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి రమేష్


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాలికలు

చేగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని ఎస్జీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి గంగాల రమేష్ అన్నారు. శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 బాల, బాలికల వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలు చేగుంట ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమస్థానం మెదక్, ద్వితీయస్థానం సంగారెడ్డి, తృతీయస్థానం సిద్దిపేట కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమస్థానం సిద్దిపేట, ద్వితీయస్థానం సంగారెడ్డి, తృతీయస్థానం మెదక్ కైవసం చేసుకున్నట్లు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా నుంచి వివిధ క్రీడా పోటీల్లో చాలామంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు ఈనెల 16, 17వ తేదీల్లో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచి మెదక్ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అల్లి నరేష్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, మెదక్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, నాగరాజు, శంకర్, శ్రీను, ప్రవీణ్, నరేష్, శారద, మిధున పాల్గొన్నారు.


భవిష్యత్‌తరాలకు వ్యవసాయం తప్పనిసరి

● విజ్ఞాన జ్యోతి కళాశాల అధ్యక్షుడు, సినీ నిర్మాత సురేష్‌బాబు


తునికిలోని విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

కౌడిపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 9: భవిష్యత్‌తరాలకు వ్యవసాయం తప్పనిసరి అని విజ్ఞాన జ్యోతి కళాశాల అధ్యక్షుడు, సినీ నిర్మాత సురేష్‌బాబు సూచించారు. శనివారం మండల పరిధి తునికిలోని విజ్ఞాన జ్యోతి విద్యాసంస్థల పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 2004లో గ్రామీణ పేద విద్యార్థుల కోసం రామానాయుడు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కళాశాలలో శిక్షణ పొందిన 300ల మంది విద్యార్థులు ఏఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గతంలో ఇక్కడ చదివిన 500ల మంది విద్యార్థులు ఒకేచోట కలుసుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రాంప్రసాద్, డైరెక్టర్ కెన్.రాము, మాజీ డైరెక్టర్ డీఎస్.రావు పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండ


ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

నారాయణఖేడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మత్స్య సహకార సంఘాల సమ్మెఖ్య రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మత్స్యకారులకు చేయూతనందిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6,153 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని, ఇందులో 40 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 2018 నుంచి 2023 వరకు రాష్ట్రవ్యాప్తంగా 571 మంది మృతిచెందినా ఒక్కరికీ పరిహారం ఇవ్వలేదన్నారు. త్వరలో మహిళా మత్స్యకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు మాజీద్, హన్మాండ్లు, సద్దాం, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు వినయ్, సుమతి


వినయ్

సిద్దిపేట కల్చరల్/కొండాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యోగాసన భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే 5వ జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి సిద్దిపేట పట్టణానికి చెందిన వినయ్(యోగా క్రీడాకారుడు) ప్రాతినిధ్యం వహించనున్నాడు. అస్సాం రాష్ట్రంలోని గౌహతి వేదికగా 11 నుంచి 14 వరకు ట్రెడిషనల్ యోగా విభాగంలో 10 నుంచి 14 ఏళ్ల వయస్సు వాళ్ల పాల్గొనే పోటీల్లో వినయ్ పాల్గొంటాడని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తోట ఆశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతనెలలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వినయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. కొండాపూర్ మండల పరిధిలోని గంగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమతి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పండరినాయక్ తెలిపారు.

12న ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 12న కొల్లూరులోని ది-గాడియం స్కూల్‌లో ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాలుర, బాలికలు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9000609038 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

తండాలు.. దండాలు

చెరగని సాంస్కృతిక సౌరభం.. గిరిపుత్రుల సంప్రదాయం

సండే స్పెషల్

ఐదో పేజీ తరువాయి

వస్తున్న ఆనవాయితీ. గిరిజనుల పశుసంపద రక్షణకు, వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని పూర్వం నుంచి జరుపుతున్నారు. తండా చివరలో ఏడుగురు అక్కాచెల్లెళ్లయిన (తుల్జా భవానీ, దుర్గా భవానీ, హీంగ్లా భవానీ, అంబ భవానీ, గండి భవానీ, మత్రా భవానీ, సీత్లా భవానీ) దేవతల ప్రతిమలను పొడవాటి రాళ్లతో తయారు చేసి ఒకే వరుసలో ప్రతిష్ఠించి వాటికి ఎదురుగా వంద అడుగుల దూరంలో లుంకడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు. ఏడుగురు అమ్మవార్లలో చిన్నదైనా సీత్లా భవానీ పేరిట పండుగ నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గిరిజనులు గొర్రెపోతులు, మేకలను బలి ఇచ్చేటప్పుడు వచ్చే రక్తం, ఉడకబెట్టిన గుడాలు కలిపి ప్రత్యేక పదార్థం తయారుచేస్తారు. బలి ఇచ్చిన గొర్రె, మేకల పేగులను దేవతా ప్రతిమల నుంచి లుంకడ్యా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి పశువులను దాటిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన పదార్థాన్ని పశువులపై చల్లుతారు. ఇలా దీన్ని దాటుడు పండుగగా పరిగణిస్తారు. ఆషాడ మాసంలో ఒక్కొక్క మంగళవారం ఒక్కొక్క తండాలో సీత్లా భవానీ పండుగను నిర్వహిస్తారు.


సీత్లా భవానీ అమ్మవారికి పూజాలు చేస్తున్న గిరిజనులు

తొమ్మిది రోజుల తీజ్

పెళ్లికాని అమ్మాయిలు మట్టిలో విత్తనాలు నాటి, భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటూ జరుపుకునే పండుగే తీజ్. మట్టిలో నాటిన విత్తనాలకు నీటిని పోస్తూ.. తొమ్మిది రోజులపాటూ నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారు. తొమ్మిది రోజుల తర్వాత మొలకెత్తిన విత్తనాలను చేతితో తలపైన ఎత్తుకొని, ఊరేగింపుగా డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ.. గ్రామ శివారులో ఉండే చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆచారాలను మరువకుండా పద్ధతిగా పాటిస్తుంటారు. తండాలల్లో ఉంటున్న కుటుంబాల పిల్లలు ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ తీజ్ పండుగ వచ్చిందంటే మాత్రం వారివారి స్వస్థలాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకుంటున్నారు.


తండాలో ఆరుబయట రొట్టే చేస్తున్న గిరిజన మహిళ


జొన్నరొట్టెపై సోలాయి వంటకం

గిరిజనుల స్పెషల్ సోలాయి

గిరిజనులు శారీరక దృఢత్వం కోసం ప్రతీ పండుగకు సోలాయి, కార్‌బోటి వంటకాలు చేసుకుని తింటారు. పండగలకు తండాల్లో గొర్రెలు, మేకలు బలిచ్చినప్పుడు రక్తాన్ని ఒక గిన్నెలో పట్టి అందులో చింతపండు, ఉప్పు కలిపి నానబెడతారు. తర్వాత మాంసంలోని మెత్తటి ముక్కలు తీసి నీళ్లు పోయకుండా ఉడకబెడతారు. మాంసం ఉడికిన తర్వాత రక్తంతో చేసిన చింతపండు మిశ్రమాన్ని మాంసంలో వేసి ఉడికించడంతో వంటకం తయారవుతుంది. దీన్ని ఆహారంగా తీసుకునేందుకు గిరిజనులు ఆసక్తి చూపిస్తారు. ఎలాంటి మసాలాలు, నూనె, నీళ్లు లేకుండా చేసిన సోలాయి వంటకాన్ని తినడం ద్వారా ఒంటికి బలం చేకూరుతుందని వారి నమ్మకం. అలాగే నూనె, నీళ్లు లేకుండా పసుపు, ఉప్పు కలిపి మటన్, చికెన్‌తో కార్‌బోటి వంటకం చేసుకుని తింటారు.

జొన్న రొట్టె, ఎల్లిపాయ మిరం

గిరిజనులకు ఆనాటి కాలంలో వంట నూనెలు అడవిలో లభించకపోవడంతో దొరికిన ఆకుకూరలు, పుట్టగొడుగులను సేకరించి కూర వండుకుని జొన్న రొట్టెలకు అద్దుకొని తినేవారు. అలాగే జొన్న రొట్టె, ఎల్లిపాయ మిరం గిరిజనులు ఇష్టంగా తీసుకుంటారు. గిరిజనులు ఆహారం కోసం ఎక్కువగా జొన్న పంటను సాగు చేస్తున్నారు. వానాకాలం, ఎండాకాలంలో గిరిజనులు ఎక్కువగా చేపల పులుసు చేసుకుని మక్క, జొన్న గడకను ఆహారంగా తీసుకుంటారు. వ్యవసాయ, కూలీల పనులు ముగించుకొని దగ్గరలోని కుంటలు, చెరువులలో వేటకు వెళ్లి చేపలు పడుతుంటారు. దీంతో కూర వండుకుంటారు. మిగిలిన చేపలను ఎండబెట్టుకుని వ్యవసాయ పనులకు వెళ్లినప్పుడు కూరలకు వాడుకుంటారు.

కార్యాలయాలను పునరుద్ధరించాలి

హుస్నాబాద్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణం నుంచి ఎత్తివేసిన కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను పునరుద్ధరించాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కోరారు. హుస్నాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం హుస్నాబాద్‌కు వస్తున్న మంత్రి బండి సంజయ్‌కి ఈ విషయంపై వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కేంద్ర మంత్రిగా గడ్డం వెంకటస్వామి (కాకా)హయాంలో బీడీ కార్మికుల దవాఖానా, ఖాదీ గ్రామోద్యోగ బండార్, ఎన్‌టీసీ రిటెల్ సెంటర్‌లు ఉండేవని, కొన్ని సంవత్సరాల అనంతరం వాటిని ఎత్తివేశారని తెలిపారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేడ హుస్నాబాద్‌లో పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు దొడ్డి శ్రీనివాస్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణ పరిధిలోని పొట్లపల్లి తాటి వనంలో తన సొంత నిధులతో వేసిన బోర్ మోటార్‌లను మంత్రి ప్రారంభిస్తారన్నారు. అనంతరం గౌడ సోదరుల కుటుంబాలతో భోజన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయరూ?

- గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై 32 గుంతలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- రాత్రివేళల్లో గుంతలు కనబడక ప్రమాదాలు



గజ్వేల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. 8 ఏళ్లుగా ఎక్కడ గుంత కనబడినా పూడ్చిన అధికారులు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. దీంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డు ఇరువైపులా గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం మారడం, అధికారులు మారడం, నిధుల లేమి సమస్యగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులకు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాల బారినపడుతూ గాయాల పాలవుతున్నారు. ఈ విషయంపై స్పందించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిత్యం అదే రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడం లేదు.

అన్నీ గుంతలే

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డు మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఎక్కడ చూసినా గుంతలే ఉండడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గజ్వేల్ పట్టణంలోని బాబుజగ్జీవన్‌రావు విగ్రహం నుంచి ప్రజ్ఞాపూర్ చౌరస్తా వరకు 14గుంతలు పడితే, ప్రజ్ఞాపూర్ చౌరస్తా నుంచి గజ్వేల్ జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు 18గుంతలు పడ్డాయి. ఇరువైపులా 32గుంతలు పడడంతో వాహనదారులు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులను వేడుకుంటున్నారు.

గతంలో క్షణాల్లో పూడ్చేవారు

గతంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డు మార్గంలో చిన్న గుంత పడినా అధికారులు వెంటనే స్పందించి పూడ్చేవారు. కానీ ప్రస్తుతం పదుల కొద్ది గుంతలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదుట, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట భారీ గుంతలు ఏర్పాడ్డాయి. ప్రజ్ఞాపూర్ ఐడీబీఐ బ్యాంకు వద్ద, శివాలయం కమాన్ వద్ద, అంబేడ్కర్ కూడలి వద్ద గుంతలు రోజురోజుకూ పెరిగి పెద్దవవుతున్నాయి. ఈ గుంతలకు కనీసం మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అమానుషం

- మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాలకు రెండో విడత దళితబంధు మంజూరు చేయాలని పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కౌశిక్‌రెడ్డిని పరామర్శించిన అనంతరం ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా పాలనలో పేద దళితుల పక్షాన పోరాడితే దాడులు చేస్తారా అంటూ ప్రశ్నించారు.

- ములుగు: దళిత సంఘాలు ధర్నా నిర్వహిస్తే మద్దతు తెలపడానికి వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తగదని ములుగు మండల బీఆర్‌ఎస్ దళిత సంఘం సీనియర్ నాయకుడు ఆదాస్ రవి అన్నారు.

మైటా మలేషియా కార్యక్రమంలో మనోళ్లు



కార్యక్రమంలో అందె భాస్కర్ పేరిణి నృత్యం సభ్యులు

మిరుదొడ్డి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మైటా మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలంగాణ 10 ఏళ్ల పండుగ కార్యక్రమంలో మిరుదొడ్డి మండలం అందె భాస్కర్, పేరిణీనృత్యం సభ్యులు డప్పు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. మలేసియాలోని సుబ్రహ్మణ్యంస్వామి ఆలయం, ట్విన్‌టవర్స్ ఎదుట వారు డప్పుకళను ప్రదర్శించారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

- మద్దూరు మండల ప్రత్యేకాధికారి రాధిక



మద్దూరులో సర్వేను ప్రారంభిస్తున్న చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి

మద్దూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి టి. రాధిక తెలిపారు. మద్దూరు మండలంలోని మర్మాములలో శనివారం సర్వేను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, కార్యదర్శి రేణుక తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.

- దుబ్బాక/మిరుదొడ్డి: దుబ్బాక మున్సిపాలిటీలోని 11వవార్డు, రామక్కపేటలో డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య, ప్రత్యేకాధికారి తనూజ, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్‌శర్మ, కమిషనర్ రమేష్‌కుమార్ తదితరులు ప్రారంభించారు. అలాగే మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని అక్బర్‌పేటలో మండల ప్రత్యేకాధికారి గణేష్‌రామ్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి ప్రారంభించారు. వారివెంట ఎంపీవో జహిరోద్దిన్, పంచాయతీ కార్యదర్శులు ఫహీమ్, రవి ఉన్నారు.
- చేర్యాల: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కొమురవెల్లి మండలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి రాంరెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఎస్‌కె. అహ్మద్, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో కుమారస్వామి తదితరులు గౌరాయపల్లి, ఐనాపూర్, కొమురవెల్లి, కిష్టంపేట, పోసాన్‌పల్లి, రాంసాగర్, మర్రిముస్త్యాల గ్రామాల్లో పర్యటించి సర్వే పరిశీలించారు.
- గజ్వేల్: గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, కుకునూరుపల్లి, జగదేవ్‌పూర్, మర్కుక్, ములుగు, వర్గల్, రాయపోల్ మండలాల్లోని గ్రామాల్లో 588 ఇళ్లను సర్వే చేసినట్లు గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ తెలిపారు.

'పకడ్బందీగా సర్వే నిర్వహించాలి'



మాట్లాడుతున్న శంకర్

మిరుదొడ్డి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ కోరారు. మిరుదొడ్డిలో శనివారం డీబీఎఫ్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సామాజిక ఆర్థిక, రాజకీయ, విద్య ఉపాధి తదితర వాస్తవ పరిస్థితులపై సర్వే చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీబీఎఫ్ నాయకులు వేణు, కిరణ్, లింగం తదితరులున్నారు.

రెవెన్యూ డివిజన్ సాధనకు బలమైన పోరాటాలు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీసభ్యుడు మోకు కనకారెడ్డి

చేర్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్, తద్వారా నియోజకవర్గ కేంద్రం సాధనకు బలమైన పోరాటాలు నిర్మిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓగార్డెన్స్‌లో శనివారం 20వ మహాసభ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలో విలీనంతో చేర్యాల ఉనికి కోల్పోయిందని, ఎనిమిదేళ్లుగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని ఆందోళనలు కొనసాగించినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం రెవెన్యూ డివిజన్ జేఏసీలో అధికార పార్టీ నాయకుడిని చైర్మన్‌గా ప్రకటించుకుని ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడం విరమించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు, కొంగరి వెంకట్‌మావో, పోలోజు శ్రీహరి, చొప్పరి రవికుమార్, బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్, తాముదాల నర్సిరెడ్డి పాల్గొన్నారు

'మహాపాదయాత్రను విజయవంతం చేయాలి'

హుస్నాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించాలని, ఈ నెల 27, 28 తేదీల్లో కరీంనగర్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి వేములవాడ రాజన్న దేవస్థానం వరకు నిర్వహించే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు గడిపె మల్లేశ్ కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు శ్రీనివాస్, సంజీవరెడ్డి, సదానందం, శ్రావన్‌రెడ్డి, మనోహర్, లక్ష్మి, భాగ్యలక్ష్మి, బత్తుల చంద్రమౌళి తదితరులున్నారు.

బీఎస్పీ సభ్యత్వ నమోదు

హుస్నాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపల్లి యాదగిరి నాయకులకు సూచించారు. నియోజవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్, నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, ఎనగందుల శంకర్, వేల్పుల రాజు, ఈర్ల మల్లేశ్, రవీందర్, బాబు, మొగిలిపాక శ్రీనివాస్ తదితరులున్నారు.

'కాంగ్రెస్ నాయకులపై పోస్టులు పెట్టడం సరికాదు'

సిద్దిపేట అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావును హేళన చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం మానుకుంటే బాగుంటుందని సీనియర్ నాయకుడు జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తూ మైనంపల్లి హనుమంతరావు కింద పడిపోయిన ఘటనను హేళన చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం సరైనది కాదని అన్నారు.

జేఏసీ కార్యవర్గ నియామకం

చేర్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ పట్టణ కన్వీనర్‌గా ఆడెపు నరేందర్, కో-కన్వీనర్లుగా కాటం సురేందర్, చెవిటి లింగం, పోలోజు కుమారస్వామి, రూరల్ కమిటీ కన్వీనర్‌గా నర్ర మహేందర్‌రెడ్డి, కోకన్వీనర్‌గా మంజ మల్లేశం నియామకమయ్యారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో కార్యవర్గ విస్తరణ, నియామకం చేపట్టినట్లు చైర్మన్ పరమేశ్వర్ తెలిపారు. కొమురవెల్లి మండల కన్వీనర్‌గా చెరుకు రమణారెడ్డి, కో-కన్వీనర్లుగా దండ్యాల లక్ష్మారెడ్డి, కుడిక్యాల బాలమోహన్, మద్దూరు మండల కన్వీనర్‌గా రామదుగు బాలరాజు, కో కన్వీనర్లుగా మోకు ఉదయ్‌రెడ్డి, జంగిలి యాదగిరి, దూళిమిట్ట మండల కన్వీనర్‌గా సుందరగిరి భాస్కర్, కోడెం యాదగిరి, వలబోజు నర్సింహచారి, మహిళా జేఏసీ కన్వీనరర్‌గా ఇర్రి ఉమా, కార్మిక జేఏసీ కన్వీనర్‌గా ముస్త్యాల గణేశ్, కో-కన్వీనర్‌గా ఒగ్గు తిరుపతి, కార్యాలయ కార్యదర్శిగా బండి శ్రీనివాస్ నియమించినట్లు తెలిపారు.

దమ్ముంటే సిద్దిపేట అభివృద్ధికి నిధులు తేవాలి

- బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చీటికీ మాటికీ వస్తున్న మైనంపల్లి హనుమంతరావు దమ్ముంటే సిద్దిపేటలో ఆగిపోయిన అభివృద్ధికి నిధులు తీసుకరావాలని బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, పాల సాయిరాం, పూజల వెంకటేశ్వరరావు, ధర్మవరం బ్రహ్మం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటలో మైనంపల్లి లాంటి నాయకులు వచ్చి అవాకులు చవాకులు పేల్చితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అరవింద్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పూటకో పార్టీ మారే సాకి ఆనంద్ లాంటి నాయకులకు హరీశ్‌రావు గురించి మాట్లాడే, విమర్శించే స్థాయి లేదని సిద్దిపేట బీఆర్ఎస్ నాయకులు సామల్ల సాయిప్రేమ్, మద్దెల నర్సింహులు మండిపడ్డారు. పట్టణంలోని 37వ వార్డు పోచమ్మ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 37వ వార్డు కౌన్సిలర్ భర్త సాకి ఆనంద్ హరీశ్‌రావుపై మరోసారి వాఖ్యలు చేస్తే భౌతిక దాడులు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్యాదరి సందీప్, సామల్ల గణేష్, ఎర్ర రజనీకాంత్, బత్తుల ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేయాలి

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



గజ్వేల్: బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీకి మొక్కను అందజేస్తున్న అధికారులు

గజ్వేల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేయాలని గజ్వేల్ ఏసీపీ కె. పురుషోత్తంరెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లిలోని బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడిన ఆయన పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆయనవెంట తొగుట సీఐ లతీఫ్, బేగంపేట ఎస్‌హెచ్‌వో అమృత్, సిబ్బంది ఉన్నారు.

రోడ్లపై ధాన్యం కుప్పలు పోయొద్దు

సిద్దిపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం కుప్పలు పోసి వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని, అమాయక ప్రజల మరణానికి కారణం కావద్దని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను రైతులకు సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లో రోడ్డు పై ధాన్యం కుప్పలు పోసిన రైతులకు శనివారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల ప్రమాదాలు జరిగి చనిపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండువేల చీరలు పంచడం గొప్ప విషయం

- మైనంపల్లి హనుమంతరావు



మాట్లాడుతున్న మైనంపల్లి హనుమంతరావు

సిద్దిపేట టౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో మొదటిసారిగా 37వ వార్డు కౌన్సిలర్ భర్త సాకి ఆనంద్ 2 వేల మందికి చీరలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు సాకి ఆనంద్‌కు హ్యాట్సాఫ్ అని మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, ఆలకుంట మహేందర్, బొమ్మల యాదగిరి, లక్ష్మి, కలీమొద్దీన్, గయాసుద్దీన్, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, దాస అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు రెగ్యులర్‌గా వేతనాలు అందేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావుకు ఆర్పీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు సాకి ఆనంద్, ఆర్పీలు లక్ష్మి, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం'

గజ్వేల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లపోచమ్మ ఆలయ నిర్మాణానికి అన్ని విధాల సహకరిస్తామని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లిలో నల్లపోచమ్మ ఆలయ నిర్మాణ విషయమై గ్రామస్థుల కోరిక మేరకు శనివారం ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయనవెంట నాయకులు ప్రభాకర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, నాయిని యాదగిరి, అనిల్‌రెడ్డి, సయ్యద్‌బాబ, ఫణి, కన్నాయాదవ్, నవీన్‌గౌడ్, సల్మాన్, అలీ, రాజు గుండన్నపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. మండలంలోని మాందాపూర్, వట్టిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు యశ్వంత్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, బిక్షపతి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీపతి రవి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు రెండు సీసీఐ కేంద్రాల ప్రారంభం

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ



జాన్‌వెస్లీ

గజ్వేల్, న వంబరు 9(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఈ నెల 11న రెండు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.జాన్‌వెస్లీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని వాసవీ కాటన్ ఇండస్ట్రీస్, జగదేవ్‌పూర్ మండలం అలీరాజీపేటలోని విశ్వతేజ కాటన్ జిన్నింగ్ మిల్లులు సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు నోటిఫై చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మార్కెట్ పాలకవర్గం, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పత్తి రైతుల సౌకర్యార్థం వ్యవసాయశాఖ వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, 8897281111 ద్వారా రైతులు పత్తి అమ్మకం, అర్హత, ఉత్పత్తి వివరాల, చెల్లింపు స్థితిని తెలుసుకునే వీలుందని తెలిపారు.

అనుమతి లేకుండా పోలీస్ సైరన్లను బిగించొద్దు

- సిద్దిపేట, గజ్వేల్ ట్రాఫిక్ సీఐలు
- ఆరు వాహనాల సైరన్ల తొలగింపు



గజ్వేల్‌లో సైరన్ వాహనాలను గుర్తించేందుకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సీఐ మురళి

సిద్దిపేట క్రైం/గజ్వేల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంతమంది అనుమతి లేకుండా వారి వాహనాలకు పోలీస్ సైరన్ ఏర్పాటు చేసుకున్నారని, తనిఖీలు నిర్వహించి ఆరు వాహనాలకున్న సైరన్లు తొలగించామని సిద్దిపేట సీఐ ప్రవీణ్‌కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం శనివారం సిద్దిపేట గజ్వేల్ పట్టణంలో పత్యేక తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. వాహన యజమానులు పోలీస్ సైరన్ తీసివేయాలని, లేకపోతే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన యజమానులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుళ్లు రఘు, కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సేవలు వినియోగించుకోవాలి

గజ్వేల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో పోలీసు సేవలను వినియోగించుకోవాలని షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు కోరారు. గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్, ఎడ్యుకేషన్ హబ్, తదితర ప్రాంతాల్లో షీటీమ్, డయల్-100, సైబర్ క్రైమ్ నెంబర్, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌లను వాల్ పేయింటింగ్ వేయించారు. ఆయనవెంట కానిస్టేబుళ్లు రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

- సిద్దిపేట క్రైం 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మిద్దె తిరుపతి, రామచంద్రం అనే వ్యక్తుల ఫిర్యాదు మేరకు నెల క్రితం పోగొట్టుకున్న వారి ఫోన్లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అందజేశారు.
- గజ్వేల్: గజ్వేల్ పట్టణంలో రెండేళ్ల క్రితం పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా గుర్తించి రవి అనే బాధితుడికి గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు అప్పగించారు.

'నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి'

చిన్నకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాయిపల్లి మాజీ సర్పంచ్ మహేందర్ గ్రామపంచాయతీ (2019-2024) నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ సర్పంచ్‌తో పాటు నిధుల దుర్వినియోగానికి సహకరించినవారి పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు నర్సింగం, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, ఎల్లం, కొమురవెల్లి, రామచంద్రం, అరవింద్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



కార్తీకం కమనీయం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ ముఖమండపంలో శనివారం ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అనంతరం శివలింగం, రథం ఆకారంలో ప్రమిదలను అలంకరించారు. - చేర్యాల

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల హల్‌చల్

- కాపర్‌వైర్, ఆయిల్ చోరీకి పాల్పడుతున్న వైనం



తాడూరులో ధ్వంసంచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

చేర్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా జరుగుతుండగానే లైన్ కట్‌చేసి ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన కాపర్‌వైర్, ఆయిల్‌ను అపహరించుకుపోతున్నారు. ఇటీవలి కాలంలో వరుస సంఘటనలు చోటుచేసుకుంటున్న క్రమంలో దొంగల ముఠా సంచరిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పంటచేలు, రోడ్డుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎంచుకుని ధ్వంసం చేస్తున్నారు. పాత ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్, ఆయిల్ ఉంటుండడంతో ఆగంతకులు ఎత్తుకెళ్లిపోతున్నారు. ఈవిషయమై విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ నిందితులు పట్టుబడకపోవడంతో చుట్టుపక్కల రైతులు కంటిమీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు వ్యవసాయబావుల వద్ద కాపాల కాస్తున్నారు.

కొండపాకలో ఉచిత వైద్య శిబిరం

కొండపాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) హైదరాబాద్‌కు చెందిన ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూరాలజీ అడ్మినిస్ట్రేటర్ జీకే రాజు ఆధ్వర్యంలో శనివారం కొండపాకలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ పరీక్షలతోపాటు మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధుల రోగులకు తగిన సూచనలు చేసి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు గౌతం, జార్జి మూలార్, సందీప్‌కుమార్, గౌతం కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నాయకుల సన్మానం

మిరుదొడ్డి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపీపీ సాయిలు, నాయకులు మద్దెల రాజేశం, హర్షద్, భూపతిగౌడ్, కిష్టయ్య, భూపాల్‌గౌడ్ తదితరులున్నారు.